క్లుప్తంగా

మాక్ ఎలక్షన్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో ఓటుహక్కు ప్రాముఖ్యతపై విద్యార్థులకు మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయినుంచే పౌరులు వారి బాధ్యతలు ఎలా నిర్వహించాలో ఈ సాధారణ ఎన్నికల ద్వారా తెలుస్తుందన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటే పునాదని, దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ధారించేందుకు ఓటు ఎంతో ఉపయోగపడుతుందని, ఆర్టికల్ 326 ద్వారా పౌరులందరికీ ఓటుహక్కు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు పాల్గొన్నారు.

హరితపట్టణంగా తీర్చిదిద్దాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మోర హన్మండ్లు

రాయికల్: మండలాన్ని హరితపట్టణంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలో 1, 12 వార్డుల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ.. రాయికల్ పట్టణాన్ని హరిత పట్టణంగా మార్చేందుకు ప్రతీఒక్కరు సహకరించాలన్నారు. వైస్‌చైర్మన్ రమాదేవి, కమిషనర్ సంతోష్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



రిషితేజ

జగిత్యాల: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు మౌంట్‌కార్మెల్ విద్యార్థి రిషితేజ ఎంపికయ్యాడు. ఈనెల 15 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు పీఈటీ సమంత్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం జ్యోతిస్ మరియా, జోస్మి, సోఫి, సీమా అభినందించారు.

ట్యాంక్‌బండ్‌పై సాయిచంద్ విగ్రహం ఏర్పాటు చేయాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: తెలంగాణ ఉద్యమ కళాకారుడు సాయిచంద్ సంస్మరణ సభను స్వేచ్ఛా సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం కోరుట్ల పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై సాయిచంద్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రసాధనకు తన ఆటపాటలతో అలుపెరుగని పోరాటం చేశారన్నారు. సంస్థ స్థాపకులు రాస భూమయ్య, చెన్నా విశ్వనాథం, కోటగిరి వెంకటస్వామి, కొంతం రాజం, శ్రీధర్, పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండెన్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రథమ చికిత్సపై గురువారం అవగాహనా కల్పించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రోడ్డుప్రమాదాలు జరిగినప్పుడు చేయాల్సిన ప్రథమచికిత్స సాధారణ అంశాలను వివరించారు. ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ విధానాన్ని డాక్టర్ అనిల్ కుమార్ వివరించారు. ఎస్సై కిరణ్‌కుమార్, సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి, పాల్గొన్నారు.

నోటుబుక్స్ పంపిణీ

ధర్మపురి: బాలసదనం విద్యార్థులకు గురువారం నోటుబుక్స్‌ను పంపిణీ చేశారు. జగిత్యాలకు చెందిన మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాలసదనం విద్యార్థులకు స్థానిక బాలికల పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, విద్యార్థి దత్తత కార్యక్రమం కన్వీనర్ గొల్లపెల్లి గణేశ్ రూ. 3వేలు విలువైన నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమశాఖ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం చెరుకు రాజన్న టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మొగిలిపేటలో బోనాల సంబురం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో గురువారం పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో గ్రామశివారుల్లోని గ్రామదేవతలైన నల్లపోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, ఉపసర్పంచ్ సామ రవి, వార్డుసభ్యులు, నాయకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు, గ్రామస్తులు



నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కోరుట్ల: పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ తల్లికి, మహాలక్ష్మీ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కౌన్సిలర్ మాడవేణి నరేశ్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఎల్లా నర్సయ్య, దేశవేణి రాజు, గణేశ్, రాజారాం, అశోక్, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఇంటింటికీ వెళ్లి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: నిరుపేదలను ఆదుకోవడమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రాయికల్ పట్టణంతో పాటు, ఆలూరు గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ మోర హన్మండ్లు, ఏఎంసీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, వైస్‌చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు అన్వరిబేగం, శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, ఆలూరులో సర్పంచ్ భాగ్యలక్ష్మి ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దీటి రాజరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా నాయకులు రాజన్న, మల్లారెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

రాయికల్ మండలంలోని వీరాపూర్‌కు చెందిన నిరుపేద వధువు రేష్మా వివాహానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గురువారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఆయనవెంట ఉపసర్పంచ్ మహబూబ్, కో–ఆప్షన్ మెంబర్ మొఖీద్, మాజీ సర్పంచులు రామస్వామి,కిషన్‌రావు, నాయకులు ఇబ్రహీం, స్వామిరెడ్డి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జగిత్యాల: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఏప్రిల్ 2023 నుంచి ప్రారంభమవుతాయని, వేతనాలు పెంచుతామని ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతించామని, కానీ ఇప్పటికి అమలు కాలేదన్నారు.ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో ఖర్చు ఆదా..



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రాయికల్: డ్రమ్‌సీడర్ పద్ధతితో కూలీల కొరత తగ్గుతుందని ఏవో ముక్తేశ్వర్ అన్నారు. గురువారం రాయికల్ మండలం ధర్మాజీపేటలో భూక్య తిరుపతి, కొత్తకొండ శ్రీను రైతుల పొలంలో డ్రమ్‌సీడర్‌తో వరిసాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఏవో ముక్తేశ్వర్ మాట్లాడుతూ.. ఈ పద్ధతితో కూలీల సమస్య తీరడంతో పాటు, తక్కువ ఖర్చు, సమయం వృథాకాకుండా ఉంటుందన్నారు. సర్పంచ్ స్నేహ, ఉపసర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రాజేశ్

ఇబ్రహీంపట్నం: ఆర్థిక మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ రాజేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో కళాశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు లావాదేవీలు, బీమా తదితరల అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి నవీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





సబ్‌స్టేషన్ ఎదుట దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు , ఇబ్రహీంపట్నంలో..

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కోరుట్లరూరల్/మల్లాపూర్/మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో గురువారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలతో తెలంగాణ రైతాంగానికి వ్యతిరేకిగా మారారని జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోరుట్లరూరల్ మండలంలోని అయిలాపూర్‌లో మల్లాపూర్ మండలకేంద్రంతో పాటు సిరిపూర్ సబ్‌స్టేషన్ల ఎదుట, మెట్‌పల్లి పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద, ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రేవంత్ రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మండలానికి ఉచిత అంబులెన్స్ సేవలు

- సమకూర్చిన బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు సంజయ్‌కుమార్
- హర్షం వ్యక్తం చేసిన మండల ప్రజలు



అంబులెన్స్ వద్ద నాయకులు, గ్రామస్తులు

మల్లాపూర్: మండలానికి ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తనయుడు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సంజయ్ కుమార్ సమకూర్చారు. గురువారం మల్లాపూర్ మండలకేంద్రానికి ఉచిత అంబులెన్స్ చేరుకోవడంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. మండలకేంద్రంతో పాటు పలుగ్రామాల్లో అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని సందర్భాల్లో రోగులు, గర్భిణులు ప్రాణాలు కోల్పోయారన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల ప్రజల విజ్ఞప్తి మేరకు డాక్టర్ సంజయ్ సొంతఖర్చులు వెచ్చించి మండలానికి ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించారని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రుద్ర రాంప్రసాద్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎం.ఏ సత్తార్, వీడీసీ అధ్యక్షుడు సంగ గంగరాజం, నాయకులు బొక్కల నాగరాజు, మాట్ల శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జీపీ కార్మికుల వినూత్న నిరసన



బుగ్గారంలో కళ్లకు గంతలతో నిరసన



రాయికల్‌లో కళ్లకు గంతలతో నిరసన

- 8వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె
- కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



మల్లాపూర్‌లో కళ్లకు గంతలతో..

రాయికల్/ఇబ్రహీంపట్నం/బుగ్గారం/మల్లాపూర్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో జీపీ కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారం 8వ రోజుకు చేరింది. రాయికల్ పట్టణంలో, బుగ్గారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, మల్లాపూర్ మండలకేంద్రంలోని భరతమాత కూడలి వద్ద పారిశుధ్య కార్మికులు, కారోబార్లు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామపంచాయతి సిబ్బందికి ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు బొబ్బిలి కిషోర్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మెచేస్తున్న జీపీ సిబ్బందికి సంఘీభావం తెలిపారు.

అంగన్‌వాడీల రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మెట్‌పల్లి: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతంచేయాలని అధ్యక్షురాలు సాయిఈశ్వరీ కోరారు. పట్టణంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, లక్ష్మీనర్సు, సుల్తానా, చాట్ల విజయలక్ష్మి, రాజమణి, సునీత, వనిత తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



గ్రామసభలో అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

మల్లాపూర్: ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విలేజ్ బస్ అధికారి సుతారి రాజశేఖర్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని వీవీరావుపేటలో టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం చేయడానికి ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రాణాలు కోల్పోవద్దని, సురక్షితంగా గమ్యస్థానం చేరడానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. ఆర్టీసీ సంస్థ విద్యార్థులకు, వికలాంగులకు, కిడ్నీ రోగులకు బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. వివాహాది శుభకార్యాలకు, తీర్థయాత్రలకు ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలని, అతి తక్కువ ధరలకు నిబంధనల ప్రకారం బస్సులను సమయం,దూరాన్ని బట్టి అద్దెకిస్తున్నామన్నారు. ఆర్టీసీబస్సు బుకింగ్‌కు సెల్: 9959225927, 7382851039లలో సంప్రదించాలన్నారు. సర్పంచ్‌లు బిట్ల సరోజన, జోగుల మమత, ఎంపీటీసీలు గుగ్లావత్ భూమి, తోట సుజాత, ఉపసర్పంచ్‌లు వెల్మల రాజనర్సయ్య, కోడిమ్యాల రవి, నాయకులు బిట్ల నరేశ్, జోగుల రాజేశ్, తోట శ్రీనివాస్, గుగ్లావత్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కూరగాయలు పండించాలి



విత్తనాలు పంపిణీ చేసిన ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: మహిళలు గ్రామాల్లో వివిధ రకాల కూరగాయలను పండించి లబ్ధిపొందాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. గురువారం మండలకేంద్రంలోని స్త్రీశక్తి మండల సమైఖ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో వివిధ రకాల కూరగాయలు పండించాలని విత్తన ప్యాకెట్లు పంపిణీచేశారు. స్వచ్ఛసర్వేక్షన్‌లో భాగంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించి వర్షకాలంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, డీపీఎం మల్లేశ్, ఏపీఎం శంకర్, సీసీఎస్‌లు సురేఖ,సాయేందర్, రాజశ్రీ,మహిళలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీపై బీఎల్వోల సమావేశం

కథలాపూర్: మేడిపెల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై తహసీల్దార్ ఎండీ. బషీరోద్దీన్ బీఎల్వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు మండలంలో 38,597 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బీఎల్వోలు తమ పరిధిలో ఇంటింటా తిరిగి ఓటరు జాబితాలో అభ్యంతరాలను తెలుసుకోవాలన్నారు. కొత్త ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

యువకుడి రక్తదానం

కథలాపూర్: భీమారం మండలం వెంకట్రావుపేటకు చెందిన తునికి శాన్విక చిన్నారికి చికిత్సనిమిత్తం రక్తం అత్యవసరమైంది. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఎండీ. సయ్యద్ గురువారం కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసిన సయ్యద్‌ను గ్రామస్తులు అభినందించారు.

పాత పెన్షన్ సాధన పోస్టర్ విడుదల

ధర్మపురి: రాష్ట్రంలోని 33 జిల్లాల గుండా సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల పాత పెన్షన్ సాధన సంకల్పయాత్ర పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. దొంతాపూర్ మగ్గిడి మోడల్ స్కూల్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ .. అభి నహీతో కభీ నహీ అనే నినాదంతో పాత పెన్షన్ సాధనకు అంతిమ పోరాటంగా జూలై 16న జోగులాంబ గద్వాల్‌లో మొదలై జగిత్యాల జిల్లా కేంద్రంలో జూలై 26న సాయంత్రం నిర్వహించే పాత పెన్షన్ సాధన సంకల్పయాత్రకు జిల్లాలోని ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు పవన్‌కుమార్, బండారి సతీశ్, బైరి మార్కండేయ, నందగిరి రాజు, లత, హారిక, సరిత ఉన్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో మొక్కజొన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. పలువురు రైతుల పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించి ఉన్నట్లు గుర్తించారు. కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. రైతులు పంటసాగులో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో యోగితా, ఏఈవోలు ఫమీనా, వైష్ణవి, వినీత, డైరెక్టర్ మేడిపెల్లి రాజారెడ్డి, రైతులు పిడుగు మహేందర్, గోపిడి ధనుంజయ్, క్యాతం దేవయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యం పనుల పరిశీలన

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో పారిశుధ్యం పనులను గురువారం ఎంపీడీవో సంతోష్ కుమార్ పరిశీలించారు. ఇంట్లో నీటినిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో పిచ్చిమొక్కలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కార్యదర్శులను ఆదేశించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రైతుసిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది ప్రజలకు వివరించాలని సూచించారు. పారిశుధ్యంపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీఎం చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



నోటు బుక్కులు అందిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

మల్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, నోటుబుక్కులు అందిస్తూ, నాణ్యమైన విద్యనందిస్తున్నామని మల్యాల ఎంఈవో ఐత శ్రీనివాస్ అన్నారు. మల్యాల మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పారిశుధ్యం నిర్వహణపై దృష్టి సారించాలి

మల్యాల: పారిశుధ్యం నిర్వహణ, హరితహారంపై దృష్టిసారించాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నరేశ్ అన్నారు. గురువారం మల్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురువు కుటుంబానికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

వెల్గటూర్: చదువునేర్పిన గురువు ఆకస్మిక మృతితో వారి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించి తమ విధేయత చాటుకున్నారు పూర్వ విద్యార్థులు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లికి చెందిన భూపెల్లి విజయ్ రాఘవపట్నంలో 2000–09 సంవత్సరం కాలంలో ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ఈనెల 8న గుండెపోటుతో మరణించడంతో గురువు కుటుంబానికి అండగా నిలవాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా పూర్వవిద్యార్థులంతా కలిసి స్నేహితులు గ్రామస్తులల సహకారంతో రూ.39వేలు సేకరించి గురువారం వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సంపద వనంలో పండ్ల మొక్కలు నాటాలి

ఇబ్రహీంపట్నం: సంపద వనాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటాలని మెట్‌పల్లి ఫారెస్ట్‌రేంజ్ అధికారి షౌకత్‌అలీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 3 సంపద వనాల్లో నాటిన మొక్కలను పరిశీలించారు. సంపద వనంలో ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ వైర్ చుట్టూ వెదురు చెట్లను నాటాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. గోధూర్ సెంట్రల్ నర్సరీలో కావాల్సిన వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏమైనా సూచనలు, సలహాలు ఉంటే ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, బిట్ అధికారి రత్నాకర్, ఎస్సారెస్పీ ఏఈ సుఖన్య, ఇన్‌చార్జి ఏపీవో వినోద్, టెక్నికల్ అసిస్టెంట్లు స్రవంతి, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వివక్ష వీడండి

కథలాపూర్: ప్రభుత్వ పాఠశాలలపై బీఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని కథలాపూర్ మండల ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఆకుల సంతోష్ మండిపడ్డారు. గురువారం కథలాపూర్ మండలకేంద్రంలో పాఠశాలల మధ్యాహ్నభోజన నిర్వాహకుల సమ్మెకు ఎస్ఎస్‌యూఐ నాయకులు మద్దతు తెలిపారు.